క్లుప్తంగా

కుంభాభిషేకం ప్రారంభం



భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్న పురోహితులు, చైర్మన్

పాకాల: పాళ్యం కొండపై వెలసి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన 54 అడుగుల భారీ విగ్రహావిష్కరణ కుంభాభిషేక మహోత్సవాన్ని ప్రారంభించారు. సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి చేతుల మీదుగా పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. ఉదయం 9 గంటలకు గణపతిపూజ, పుణ్యాహవచనం, సాయంత్రం వాస్తు హోమం, గంగపూజ, మృత్సంగ్రహణ, అంకురార్పణ, అఖండ స్థాపన, వరుణావాహన కలశస్థాపన, తీర్థప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో, వేద పండితులతో నిర్వహించారు. అనంతరం చైర్మన్, స్థానిక సర్పంచ్ గౌరీశంకర్‌రాజు రేపు జరిగే విగ్రహ ఆవిష్కరణకు ఏర్పాట్లను పరిశీలించారు.

రేపు పీహెచ్‌సీ నూతన భవనం ప్రారంభం

- ప్రారంభించనున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

పాకాల: మండల కేంద్రానికి సమీపంలో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని రేపు(బుధవారం) చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా సోమవారం పీహెచ్‌సీ డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీ శిథిలావస్థకు చేరడంతో స్పందించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి తుడా నిధులను కేటాయించి, అత్యాధునిక వసతులతో రూ.1.95 కోట్లతో ఈ భవనాన్ని నిర్మించారని పేర్కొన్నారు. నూతన భవన ప్రారంభోత్సవానికి అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులతో నమూనా ప్రశ్నపత్రాలు రాయించాలి

పాకాల: మండలంలోని ఎస్‌ఈఏఎస్(స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే)కి ఎంపికైన పాఠశాలల విద్యార్థులతో హెచ్‌ఎంలు నమూనా ప్రశ్నపత్రాలను రాయించాలని ఎంఈఓ-2 లింగయ్య తెలిపారు. సోమవారం మండలంలోని ఎన్‌వీఎన్ పాఠశాలలో హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ దేశం మొత్తం 36 రాష్ట్రాలలో నవంబర్ 3వ తేదీన ఎంపిక కాబడిన పాఠశాలల్లో 3వ, 6వ, 9వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఈ సర్వేని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలసి సంయుక్తంగా సీస్ పేరుతో నిర్వహిస్తుందని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు మోహన్, శోభారాణి, ఉపాధ్యాయులు శ్రీధర్, రాజేష్, మురళీధర్, రామకృష్ణ, నజీమా, శ్రీలక్ష్మీ, ఈశ్వర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ జట్టుకు విద్యార్థుల ఎంపిక

భాకరాపేట: రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ జట్టుకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు భాకరాపేట గీతాంజలి స్కూల్ కరస్పాండెంట్ గిరికుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయుడిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18, 19 తేదీలలో అన్నమయ్య జిల్లాలో జరిగిన సబ్ జూనియర్ పోటీలలో ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఏడో తరగతి విద్యార్థులు నేహా, లాస్యప్రియ ఎంపికవ్వడం సంతోషించదగ్గ విషయం అని కొనియాడారు.

రేపటి నుంచి విశ్రాంత ఉద్యోగులకు టీటీడీ ప్రసాదాలు

తిరుపతి కల్చరల్: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల అనంతరం టీటీడీ విశ్రాంత ఉద్యోగులకు, కుటుంబ పింఛన్‌దార్లకు అందించే శ్రీవారి లడ్డూ, వడ ప్రసాదాన్ని నవంబర్ 1వ తేదీ బుధవారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకు అందించనున్నారు. తిరుపతిలోని టీటీడీ క్యాంటీన్ వద్దనున్న కొత్త జూబిలి భవనంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రసాదాలు పంపిణీ చేస్తారు. పింఛన్‌దార్లు తమ స్మార్టు కార్డు చూపి ఒక పెద్ద లడ్డూ, ఒక వడ పొందవచ్చు. పీపీఓ నంబర్ల వారీగా ప్రసాదాల పంపిణీ జరుగుతుంది. 12 పేజీల క్యాలెండర్లను పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఉచితంగా పొందాలని టీటీడీ పేర్కొంది.

పవిత్రోత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో నవంబరు 9 నుండి 11వ తేదీ వరకు జరుగనున్న పవిత్రోత్సవాలు కరపత్రాలను టీటీడీ జేఈవో వీరబ్రహ్మం సోమవారం ఆవిష్కరించారు. పవిత్రోత్సవాలలో ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం కార్యక్రమాలు నిర్వహిస్తారు. నవంబరు 8న అంకురార్పణ జరుగనుంది. 9న పవిత్ర ప్రతిష్ఠ, 10న పవిత్ర సమర్పణ, 11న పూర్ణాహుతి నిర్వహించనున్నారు. నవంబరు 8న అష్టోత్తర శతకలశాభిషేకం, నవంబరు 9 నుంచి 11వ తేదీ వరకు కల్యాణోత్సవం, 9న తిరుప్పావడ సేవ రద్దయ్యాయి. గృహస్తులు(ఇద్దరు) రూ.516/- చెల్లించి పవిత్రోత్సవాల ఆర్జితసేవలో పాల్గొనవచ్చు. ఒక పవిత్రం, ఒక ఉత్తరీయం, ఒక రవికె, అన్నప్రసాదం అందజేస్తారు. డెప్యూటీ ఈవో వరలక్ష్మి, పీఆర్వో డా.టి.రవి, సూపరింటెండెంట్ చెంగల్రాయలు, అర్చకులు బాలాజీ రంగాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణతో ట్రాఫిక్ సమస్యలు పరిష్కారం

- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి



కనెక్టివిటీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి తుడా: నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్లతోపాటు రోడ్ల విస్తరణ, కనెక్టివిటీ రోడ్ల నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. నెహ్రూ మున్సిపల్ స్కూల్ గ్రౌండ్ కనెక్టివిటీ రోడ్డు పనులను సోమవారం ఆయన పరిశీలించారు. అలిపిరి రోడ్డును మున్సిపల్ స్కూల్ గ్రౌండ్ నుంచి చెన్నారెడ్డికాలనీ, సింగాలగుంట, ఓల్డ్ మెటర్నిటీ ఆసుపత్రి గిరిపురం రోడ్లను కలుపుతూ నిర్మిస్తున్న కనెక్టివిటి రోడ్డుతో తిరుపతి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సూర్య, చంద్రప్రభలపై కైలాసనాథుడు

- వేడుకగా సాగుతున్న ముక్కోటి ఉత్సవాలు
- నేడు పూలంగిసేవ

చంద్రగిరి: తొండవాడ స్వర్ణముఖీ నది ఒడ్డున వెలసిన శ్రీఅగస్త్యేశ్వరస్వామి(ముక్కోటి)వారి ఆలయంలో వారం రోజులుగా రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఉదయం 8.30గంటలకు స్వామివారు సూర్యప్రభ వాహనంపై విహరించారు. రాత్రి స్వామి, అమ్మవార్లు చంద్రప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రథోత్సవం

రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి అమ్మవార్లకు రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం 8.30గంటలకు రథోత్సవం, రాత్రి కామధేను వాహన సేవను వేడుకగా నిర్వహించనున్నారు.



అమ్మవారి సమేతంగా సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న సర్వేశ్వరుడు

ఊళ్లల్లోకి మైక్రోఫైనాన్స్ కంపెనీలను రానివ్వం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ, సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారులు

భాకరాపేట: ఊళ్లల్లోకి మైక్రో ఫైనాన్స్ కంపెనీలను ఎట్టి పరిస్థితుల్లోనూ రానివ్వమని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి అన్నారు. చిన్నగొట్టిగల్లు మండల సర్వసభ్య సమావేశం సోమవారం మధ్యాహ్నం స్త్రీ శక్తి భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారని కొనియాడారు. జగనన్న ఆరోగ్య సురక్షతో మండలంలో 64 మందికి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. చిన్నగొట్టిగల్లులో రూ.7 కోట్లతో అధునాతన సౌకర్యాలతో ఆసుపత్రి ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు. మండల అభివృద్ధికి కృషి చేసిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ప్రజలు రుణపడి ఉన్నారన్నారు. శాఖల వారీగా జరిగిన చర్చల్లో ఎంపీటీసీలు, సర్పంచులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇచ్చారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు స్వరూప, ఎంపీడీవో దేవేంద్రబాబు, డిప్యూటీ తహశీల్దార్ అన్వర్‌బాషా, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

పార్కుల పరిశుభ్రతకు చర్యలు



అర్జీ స్వీకరిస్తున్న కమిషనర్ డి.హరిత

తిరుపతి కల్చరల్: నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహణలో ఉన్న పార్కులు పరిశుభ్రంగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ డి.హరిత ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ ముద్రనారాయణతో కలసి పాల్గొన్నారు. డయల్ యువర్ కమిషనర్‌కు 22, స్పందనకు 26 ఫిర్యాదులు అందాయి. వాటిలో ప్రధానంగా తిరుపతి ప్రకాశం పార్కులో బాత్రూములు సరిగా లేవని, నీరు ఎప్పుడూ లీక్ అవుతుందని ఫిర్యాదుపై కమిషనర్ స్పందిస్తూ సరి చేయించమని అధికారులకు సూచించారు. శివజ్యోతినగర్‌లో ఎస్‌వీఎస్ అపార్ట్‌మెంట్ ప్రక్కనున్న మున్సిపల్ స్థలంలో చెత్తా చెదారంలో పాములు వస్తున్నాయని, అపరిశుభ్రంగా ఉందని, శుభ్రం చేయించాలని కోరారు. తుంబువానిగుంట స్కూల్ వద్ద, ఇతర ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిశీలించి పరిష్కరిస్తామని కమిషనర్ హరి తెలిపారు. ఉప కమిషనర్ చంద్రమౌళిరెడ్డి, ఎస్‌ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు కేఎల్ వర్మ, సేతుమాధవ్, కార్యదర్శి రాధిక, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్‌రెడ్డి, సిటీ ప్లానింగ్ అధికారులు శ్రీనివాసులురెడ్డి, బాలసుబ్రమణ్యం, వెటర్నరీ అధికారి డాక్టర్ నాగేంద్రరెడ్డి, మేనేజర్ చిట్టిబాబు, సూపరింటెండెంట్లు, డీఈలు, ఆర్‌ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వంలోనే సామాజిక న్యాయం



మాట్లాడుతున్న ఆర్.అజయ్‌కుమార్

తిరుపతి కల్చరల్: గత ప్రభుత్వాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకొని వదిలేసిన చరిత్ర ఉందని, అయితే అధికారం చేపట్టిన నాలుగేళ్లలోనే వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వం సామాజిక న్యాయం పాటించిందని ఆ పార్టీ నేతలు స్పష్టం చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వైఎస్‌ఆర్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆర్.అజయ్ కుమార్, టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుయాదవ్, పసుపులేటి సురేష్ మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సాధికార బస్సు యాత్రను ప్రజలు విశేషంగా ఆదరించడంతో పాటు ఎనలేని స్పందన లభించిందన్నారు. తిరుపతిలో చేపట్టిన సాధికార వేదిక్పై బలిజ సామాజిక వర్గానికి చెందిన ముద్రనారాయణకు స్థానం కల్పించలేదని బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, వైఎస్‌ఆర్ సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి సైతం వేదిక కింద కూర్చొని మిగిలినవారికి ప్రాధాన్యం కల్పించారన్నారు. గత టీడీపీ పాలనలో తుడా చైర్మన్‌గా ఉన్న నరసింహ యాదవ్‌కు టీటీడీ ఎక్స్ అఫిషియో సభ్యుడు స్థానాన్ని కూడా తొలగించి బీసీలను తక్కువ చేశారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ ఇమ్రాన్‌బాషా, వైఎస్‌ఆర్ సీపీ నేతలు ఉదయ వంశీ, చైతన్య యాదవ్, ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.


ప్రీ-రిపబ్లిక్ డే పరేడ్‌కు పద్మావతి విద్యార్థినులు



వలంటీర్స్‌ను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: దేశంలో జాతీయ స్థాయిలో జనవరి 26వ తేదీన నిర్వహించే పరేడ్ కార్యక్రమంలో పాల్గొనేందుకు శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నుంచి ఎన్ఎస్ఎస్ విద్యార్థి వలంటీర్స్ హీనా ఫాతిమా(యూనిట్-7), తెహిత కృష్ణ (యూనిట్-15), సాయి నేహా(యూనిట్-11) ప్రీ-ఆర్డీ కి ఎంపికయ్యారని ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఆచార్య ఎం.విద్యావతి తెలిపారు. నవంబర్ 1నుండి 10వ తేదీ వరకు విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో జరుగబోయే వెస్ట్ జోన్ ప్రీ-ఆర్డీ క్యాంపునకు ఎంపికైన వలంటీర్స్‌తోపాటు ఆంధ్రప్రదేశ్ స్టేట్ కంటింజెంట్ లీడర్‌గా ఎన్ఎస్ఎస్ యూనిట్-8 ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె.స్వాతి ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య డి.భారతి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రజని, ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డా.పి.మాధవి, డా.డి.యువశ్రీ, డా.ఎం.పద్మావతి వాలంటీర్స్ కి అభినందనలు తెలియజేశారు.

ప్రభుత్వ పాఠశాలలకు వంట పాత్రలు పంపిణీ



ప్రభుత్వ పాఠశాలలకు వంట పాత్రలు అందజేస్తున్న ఎంపీపీ తదితరులు

చంద్రగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ×జగనన్న గోరుముద్ద₹ కార్యక్రమంలో భాగంగా ప్రతి పాఠశాలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా నాణ్యమైన వంట పాత్రలను అందించడం సంతోషదాయకమని ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి అన్నారు. సోమవారం అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి చేతుల మీదుగా వంట పాత్రలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, విద్య కోసం ఈ ప్రభుత్వం రాజీ లేకుండా నిధులను వెచ్చిస్తోందని గుర్తు చేశారు. ఎంపీడీఓ రమేష్ బాబు, తహశీల్దార్ శిరీష, ఎంఈఓలు లలిత కుమారి, భాస్కర్ బాబు, ఎంపీటీసీ రాజయ్య, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వారపు సంతలో భోజనాలు సరఫరా



వారపు సంతలో భోజనాలు పెడుతున్న వైఎస్‌ఆర్ సీపీ నాయకులు

పాకాల: ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో నిర్వహిస్తున్న వారపు సంతలో రైతులకు, వ్యాపారస్తులకు చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్‌ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఉచితంగా భోజనాలను అందజేశారు. సోమవారం స్థానిక నాయకుల చేతుల మీదుగా భోజనాలను సరఫరా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులు, సన్న, చిన్నకారు రైతులు, వ్యాపారస్తులు భోజనాలకు ఇబ్బందులు పడకూడదని, అందరూ బాగుండాలనే ఉద్దేశంతో భోజనాలను సరఫరా చేస్తున్నారని వివరించారు. పాకాలతోపాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో జరిగే వారపు సంతల్లో భోజనాలను సరఫరా చేస్తున్నారని వివరించారు. అన్ని సమయాల్లో తమకు అండగా ఉండే ఎమ్మెల్యే కుటుంబానికి రుణపడి ఉంటామని, రాబోయే ఎన్నికల్లో వారికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

జర్మన్ పద్ధతిలో సీసీ రోడ్డు



సీసీరోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ

తిరుపతి మంగళం: తిరుపతిలో మొట్టమొదటి సారిగా జర్మన్ పద్ధతిలో సీసీరోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. తిరుపతి 6వ డివిజన్ నవోదయకాలనీలో సోమవారం రూ.40 లక్షలు మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో జర్మన్ పద్ధతిలో సీసీరోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నవోదయ కాలనీలో నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణానికి టౌన్‌బ్యాంక్ చైర్మెన్ కేతం జయచంద్రారెడ్డి, ఆ డివిజన్ కార్పొరేటర్ కేతం జానకి కొబ్బరికాయలు కొట్టి, భూమిపూజ చేశారు. వర్షం పడితే ఆ నీరంతా రోడ్డులోకి ఇంకిపోవడమే ఈ రోడ్డు ప్రత్యేకత అని కేతం జయచంద్రారెడ్డి తెలిపారు. డబుల్‌డెక్కర్ బస్సు, జర్మన్ తరహా సీసీరోడ్లను తీసుకొచ్చి తిరుపతి నగర ప్రజలకు కొత్త అనుభూతిని ఇచ్చిన ఘనత డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నగర అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, భూమన అభినయ్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 6వ డివిజన్ అధ్యక్షుడు బాలాజీ, నాథమునిరెడ్డి, పార్టీ నాయకులు నారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వాటర్‌ప్లాంట్ రవి, శివకుమార్, కార్పొరేషన్ డీఈ పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే లక్ష్యం



మాట్లాడుతున్న మల్లం చంద్రమౌళిరెడ్డి

చంద్రగిరి: రైతు శ్రేయస్సు లక్ష్యంగా నరసింగాపురం సహకార సంఘం పని చేస్తుందని నరసింగాపురం సింగిల్ విండో చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి అన్నారు. సహకార సంఘం మహాజన సభ సమావేశం చైర్మన్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మల్లం చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి రైతుకు రుణాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అర్హత ప్రామాణికంగా, ఎలాంటి జామీను లేకుండా రైతులను ఆదుకుంటున్న సంస్థ సింగిల్ విండో అన్నారు. కాంట్రాక్టుపై గత 12 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేసేందుకు సభ తీర్మానించాలని కోరారు. చంద్రగిరి, తొండవాడ బ్రాంచ్‌లో సైతం రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేసేందుకు సహకరిస్తున్నామన్నారు. పాలకమండలి సభ్యులు, రైతులు సుబ్రహ్మణ్యం యాదవ్, సంస్థ మేనేజర్ నాగేంద్రప్రసాద్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యానికి రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష



కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్ డాక్టర్ శిరీష

తిరుపతి మంగళం: ప్రజా ఆరోగ్య రక్షణే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజల ముంగిటకే తీసుకొచ్చి నాణ్యమైన వైద్యాన్ని పేద ప్రజలకు అందిస్తున్న గొప్ప నాయకుడు జగనన్న అని తిరుపతి కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష కొనియాడారు. సోమవారం జీవకోన గురు కృప స్కూల్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలలో తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో ప్రతిరోజు ఐదు ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆరోగ్య సురక్ష ద్వారా మంచి వైద్యం, ఉచిత పరీక్షలతో పాటు 172 రకాల మందుల్ని ఈ శిబిరాల్లో అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. సూపరింటెండెంట్ రవి, రమేష్, వైఎస్‌ఆర్ సీపీ నాయకుడు రాజేంద్ర, వైద్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఅర్జీ పరిష్కారానికి కృషి



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో నిషాంత్‌రెడ్డి

తిరుపతి అర్బన్: ప్రతి అర్జీకి పరిష్కార మార్గాన్ని చూపుతామని తిరుపతి ఆర్డీవో నిషాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో చేపట్టిన స్పందనకు 15 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఆర్డీవో ప్రతి అర్జీని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్పందన కార్యక్రమాన్ని ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో ఆ దిశగా వాటికి పరిష్కారం చూపుతామని తెలిపారు. అయితే అర్జీల్లో అధికంగా భూ సమస్యలే ఉన్నాయన్నారు. రీసర్వేతో భూ సమస్యలు తప్పుతాయని పేర్కొన్నారు. అయినప్పటికీ ముందే వాటికి పరిష్కారం చూపుతామని ఆయన స్పష్టం చేశారు.